క్లుప్తంగా

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



కంకిపాడు: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రోహిత్ అన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ రఫీ, ముసిబోయిన ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను జోగి రోహిత్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పాదచారులు, వాహనదారుల తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు చలివేంద్రం దోహదపడుతుందన్నారు. అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ వీర్ల జగపతి, తొడుసు శ్రీనివాసరావు, సంసోన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము మంజూరు

పెనమలూరు: సామాజిక పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ సొమ్ము మంజూరు చేసిందని ఎంపీడీఓ కుమార్‌బాబు అన్నారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ మండల పరిధిలో 18,791 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ. 5.63 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. పెనమలూరు మండలంలో 5,823 మంది లబ్ధిదారులకు రూ. 1,73,78,500, తాడిగడప మునిసిపాలిటీలో 12,968 మందికి 3,90,83,500 సొమ్ము మంజూరు చేశారని తెలిపారు. మార్చి 3వ తేదీన లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తామన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కంకిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని, అతనికి మద్యం అమ్మిన వైన్‌షాపు సేల్స్ మ్యాన్‌ను కంకిపాడు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. కోలవెన్ను గ్రామంలో బెల్టుషాపు నిర్వాహకుడు పిట్టా నారాయణరావును తనిఖీ చేయగా అతని వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 70 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి విచారించగా, కంకిపాడు ప్రధాన సెంటర్‌లో ఉన్న వైన్‌షాపులో తెల్లవారుజామున మద్యం కొనుగోలు చేసినట్లుగా నిర్ధారించారు. మద్యం అక్రమంగా విక్రయించిన మద్యం దుకాణం సేల్స్‌మ్యాన్ లాం రాకేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఇరువురినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఎస్‌ఐ సందీప్ మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయాలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బెల్టుషాపులు నిర్వహించినా, బెల్టు నిర్వాహకులకు మద్యం విక్రయించినా సంబంధిత మద్యం దుకాణాల సిబ్బందిపైనా కేసులు నమోదుచేయాల్సి ఉంటుందని, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు



మాట్లాడుతున్న టీవీ నటుడు అప్పారావు, వేదికమీద చిట్టిబాబు, డేవిడ్‌రాజు, వీరభద్రరావు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులని టీవీ నటుడు అప్పారావు అన్నారు. జేఎంఎస్ సరాగాలు ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అప్పారావు మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సీనియర్ గాయకుడు కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ గాయకులకు, కళాకారులకు వేదిక కల్పించాలని సూచించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గాయని ఝాన్సీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

పెనమలూరు: తన కుమార్తె ఇంటి నుంచి అదృశ్యమయిందని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు జెండా చెట్టు ప్రాంతానికి చెందిన షేక్ హజరాబి కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె భర్త మస్తాన్‌వలి ఆటో డ్రైవర్‌గా పని చేస్తాడు. ఆమె కుమార్తె (19) గతంలో అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో వెళ్లి పోగా తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. కాగా మార్చి 29 తేదీన హజరాబి కుమార్తె ఇంటి నుంచి అదృశ్యమయింది. ఈ ఘటనపై తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

మరణంపై విజయం.. క్రీస్తు పునరుత్థానం

ఘనంగా ఈస్టర్ పర్వదిన వేడుకలు



ప్రత్యేక దీపారాధన చేస్తున్న జ్యోతినగర్ చర్చి ఫాదర్లు



కంకిపాడులో కొత్త కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న క్రీస్తు విశ్వాసులు

కంకిపాడు: క్రీస్తు పునరుత్థాన మహోత్సవ వేడుకలను క్రీస్తు విశ్వాసులు అంతటా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి తర్వాత అన్ని చర్చిల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తును ఆరాధిస్తూ పునరుత్థాన మహోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. కంకిపాడులోని ఆరోగ్య వేళంగణి మాత దేవాలయంలో ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. దివ్యబలిపూజ సమర్పించి విశ్వాసులకు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తును ప్రార్థించారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ సతీమణి శకుంతలాదేవి, తనయుడు జోగి రాజీవ్ హాజరై ప్రార్థనలు చేశారు. క్రీస్తును నమ్మినవారికి మేలు జరుగుతుందన్నారు. అందరూ సంతోషంగా ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, డాక్టర్ సతీష్‌కుమార్, ఎస్.బాబు, నాగార్జున, నరేంద్ర, కొత్తూరు భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్..

పెనమలూరు: కానూరులోని కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో ఏసు పునరుత్థాన మహోత్సవం ఘనంగా జరిగింది. గుడ్ ఫ్రైడే పండుగ ముగిసిన తర్వాత శనివారం అర్ధరాత్రి ఏసు పునరుత్థాన మహోత్సవం సందర్భంగా దివ్యబలి పూజ నిర్వహించారు. ఫాదర్లు చలివేంద్ర శౌరి, దేవదానం, రత్నరాజ్ నూతన అగ్ని ద్వారా పస్కా వత్తిని వెలిగించారు. చిన్నారులకు జ్ఞానస్నానం ఇచ్చి నూతన నామకరణాలు చేశారు. గంగూరు, సాలిపేట, పోరంకి, కామయ్యతోపు, కానూరు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశ్వాసంతో పాల్గొన్నారు. భక్తులకు దివ్య సత్‌ప్రసాదం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ..

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక జ్యోతి నగర్ ఆర్సీఎం చర్చి, సీఎస్ఐ టౌన్ చర్చి, పరిశుద్ధ సీయోను సీఎస్ఐ చర్చి, హోసన్నా మందిర్, కారుణ్య ప్రార్థనా మందిరం, బేతేలు చర్చి, ఎల్ఎఫ్ఎల్ చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరై ప్రార్థనలు చేశారు. జ్యోతినగర్ విచారణకర్త ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి ఆధ్వర్యంలో దివ్య బలిపూజ నిర్వహించి, భక్తులకు ప్రత్యేక సందేశాన్ని అందించారు. సకల మానవాళి పాప పరిహారానికై ఏసుక్రీస్తు శిలువలో ప్రాణాలు విడిచి, ఆ తర్వాత మూడో రోజున సమాధి నుంచి పునరుత్థానుడయ్యారని ఫాదర్ జోసఫ్ తంబి తెలిపారు. బండారుగూడెంలోని ఆర్సీఎం చర్చిలోనూ ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, పాదర్ గోళ్ల విజయ్‌కుమార్ దైవ సందేశాన్ని అందించారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పర్వదిన వేడుకలు

గన్నవరం: మండలంలోని క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో ఆదివారం ఈస్టర్ పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక అద్భుత బాలఏసు దేవాలయంలో అర్ధరాత్రి నుంచి క్రీస్తు పునరుత్థానాన్ని గుర్తుచేసుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు పసల థామస్ నేతృత్వంలో దివ్యబలిపూజ జరిపారు. అనంతరం భక్తులకు ఆయన ఈస్టర్ సందేశం ఇచ్చారు. స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చిలో తెల్లవారుజామున నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పునరుత్థానానికి గుర్తుగా భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ పాల్ దివాకర్ ఈస్టర్ సందేశం ఇచ్చారు. ప్రెస్బిటర్ బండి జీవమనోహర్, పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు. అదే విధంగా కేసరపల్లి, అజ్జంపూడి, అల్లాపురం, దావాజిగూడెం, వీఎన్. పురంలోని పలు చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి.

లోకరక్షణార్థం.. క్రీస్తు పునరుత్థానం

ఉంగుటూరు: లోక పాపాలను పరిహరించేందుకు ఏసుక్రీస్తు శిలువ బలిగా అర్పించబడి మూడో రోజు పునరుత్థానుడయ్యారని తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో క్రైస్తవులు క్రీస్తు పునరుత్థాన పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలు చర్చిల్లో శనివారం అర్ధరాత్రి ఈస్టర్ పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద అవుటపల్లి తంబి పుణ్యక్షేత్రంలో ఫాదర్లు ఈస్టర్ క్యాండిల్‌ను వెలిగించారు. అందరు పరిశుద్ధ హృదయంతో జీవించాలని బోధించారు. అదే విధంగా ఉంగుటూరు, తేలప్రోలు, జోసఫ్‌నగర్, ఇందుపల్లి, మానికొండ తదితర గ్రామాల్లో ఈస్టర్ పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు..

నున్న(విజయవాడరూరల్): ఈస్టర్ పండుగను పురస్కరించుకొని ఆదివారం పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏసుక్రీస్తు సిలువపై మృతి చెంది మూడో రోజున తిరిగి లేచిన మహత్తర ఘట్టాన్ని జ్ఞాపకం చేసుకుంటూ క్రైస్తవులు ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. నున్న గ్రామంలో సీఎస్ఐ చర్చి నందు డీనరీ చైర్మన్ కె.జాన్‌వెస్లీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్సీఎం చర్చి నందు, ఫెయిత్ టెంపుల్, దైవ స్వరూపి ప్రార్థన మందిరంలతో పాటు పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పార్థనలు జరిగాయి.




నున్న సీఎస్ఐ చర్చిలో దైవ సందేశం అందిస్తున్న పాస్టర్



ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి జోగి రమేష్ సతీమణి శకుంతలాదేవి, తనయుడు జోగి రాజీవ్



గన్నవరంలో ఆర్సీఎం చర్చిలో ప్రార్థన నిర్వహిస్తున్న ఫాదర్లు



కార్మెల్ పుణ్యక్షేత్రంలో సమష్టి దివ్యబలిపూజ సమర్పిస్తున్న ఫాదర్లు



పెద అవుటపల్లి తంబి పుణ్యక్షేత్రంలో ఈస్టర్ క్యాండిల్‌ను చూపిస్తున్న ఫాదర్లు

'ఇఫ్తార్'లో పాల్గొన్న మంత్రి

పెనమలూరు: కానూరులో జరిగిన ఇఫ్తార్ విందులో మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. కానూరు సనత్‌నగర్‌లో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముస్లింలు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వలంటీర్ల నుంచి మొబైల్ ఫోన్లు స్వాధీనం

విజయవాడరూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లోని వలంటీర్ల నుంచి మొబైల్ ఫోన్లు, డేటా రికార్డులు, డివైజ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు విజయవాడ రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీరమ్య తెలిపారు. మండలంలో 798 మంది వలంటీర్లు పనిచేస్తున్నారని వివరించారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచే క్యూలైలన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

9న బాబా మందిరంలో ఉగాది వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 9వ తేది మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం(ఉగాది) వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సంవత్సర ప్రారంభం ఉగాది పర్వదినం పురస్కరించుకుని మందిరంలోని బాబావారికి, దత్తాత్రేయ, వినాయక, ఆంజనేయస్వాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు ఉగాది వేడుకల్లో పాల్గొని బాబావారిని దర్శించుకుని పూజలు చేసి ఆయన కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

జగన్ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్



రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతంలో వృద్ధులతో ముచ్చటిస్తున్న వంశీమోహన్

రామవరప్పాడు: ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరలా సృష్టించబోయే ప్రభంజనాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతంలో ఆదివారం రెండో రోజు ఎన్నికల ప్రచారంలో వంశీ మోహన్ పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ జరిగిన ప్రచారంలో పెద్ద సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు, అభిమానులు వంశీకి అపూర్వ స్వాగతం పలికారు. వంశీ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ పలువురు మహిళలు మంగళ హారతులిచ్చారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని పలు చర్చిల్లో వంశీ మోహన్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాల్వగట్టు ప్రాంతంలో హనుమాన్‌నగర్, పటేల్ నగర్, పీఎస్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో వంశీ గడప గడపకూ పర్యటించి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు.

కుటిల ప్రయత్నాలను అడ్డుకోవాలి..

వంశీమోహన్ మాట్లాడుతూ జగన్ ఒక్కడిని ఎదుర్కొలేక ప్రతి పక్ష పార్టీలన్నీ ఏకమై ఎదురుదాడి చేస్తున్నాయన్నారు. కుటిల ప్రయత్నాలు ఎన్ని చేసినా కూటమికు ఘోర ఓటమి తప్పదన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలు, మహిళలు, ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చి వారి అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం పేద వర్గాల అభివృద్ధికి ఏమి చేశారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కనబడే ప్రతిపక్ష నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని అన్నీ విధాల అభివృద్ధి చేసి చూపించామన్నారు. కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యులు కాకర్లమూడి సువర్ణరాజు, నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జి ఆర్. వెంకటేశ్వరరావు, కోనేరు సుబ్బారావు, నియోజకవర్గ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం



తాడిగడపలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ జోగి రమేష్ అన్నారు. తాడిగడప కాలువ కట్టపై ఆదివారం గడప గడపకూ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగు నిండిందన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థతో సంక్షేమ పథకాలు అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. జగనన్న అధికారంలో లేకపోతే సంక్షేమ పథకాలు రద్దు చేస్తారని ఆరోపించారు.

మోసగాళ్లను నమ్మొద్దు..

రానున్న ఎన్నికల్లో మోసగాళ్లు ప్రజల ముందుకు వస్తారని వారిని ప్రజలు నమ్మొద్దని మంత్రి జోగి రమేష్ అన్నారు. పేదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు కుట్రపన్నుతున్నాయని ఆరోపించారు. వలంటీర్లపై అక్కసు చూపుతూ పింఛన్లు పంపిణీకి చంద్రబాబు అండ్ కో అడ్డుకున్నారని ఆరోపించారు. అవ్వాతాతలు, వితంతువులు, అంగవైకల్యం పొందిన వారికి పింఛన్లు అందకుండా చేసిన కుట్రను ప్రజలు తిప్పికొట్టాలని అన్నారు. ప్రజలపై కపట ప్రేమ చూపుతున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ పార్టీలను ఎన్నికల్లో తరిమి కొట్టాలన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్, పి.రాఘవరావు, తాడిగడప మునిసిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, పార్టీ నేతలు కాకి శ్రీనివాసరావు, జిన్నా, దయాకర్, వరప్రసాద్, ఖాదర్‌బాషా, ముజీబ్, కృష్టోఫర్, శ్రీకాంత్‌రెడ్డి, ఈదా రాజేష్, వెలిశిల ప్రసాద్, పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులు

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 1 నుంచి 25వ తేదీ వరకు పాలిసెట్-2024 ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ. పద్మావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 27న పాలిసెట్ పరీక్ష జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.20 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో మంత్రి జోగి రమేష్ సమక్షంలో చేరిన నేతలు

పెనమలూరు: వైఎస్సార్ సీపీలో ఆదివారం భారీ చేరికలు జరిగాయి. తాడిగడప మునిసిపాలిటీ కానూరు, పోరంకి, యనమలకుదురు, పెనమలూరు ప్రాంతాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. గంగూరు పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేతలను మంత్రి జోగి రమేష్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న నాయకత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలో కొత్తగా చేరిన వారికి సముచిత న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన యువత..

గంగూరు వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం గంగూరు గ్రామానికి చెందిన యువత పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బంగారు నాగేంద్రబాబు ఆధ్వర్యంలో యువత పార్టీలో చేరగా మంత్రి జోగి రమేష్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో యువతకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. నియోజకవర్గ కార్యాలయం గంగూరులో ఉన్నందున యువతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మంత్రి జోగి రమేష్ హామీ ఇచ్చారు.

● హలీం టైం



రంజాన్ మాసం నేపథ్యంలో విజయవాడలోని వించిపేట పరిసరాలు హలీం సెంటర్లతో రద్దీగా మారాయి. సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సందర్శకులతో హలీం కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. హలీం ప్రియుల రాకతో ఈ ప్రాంతమంతా సందడిగా మారుతోంది. పాతబస్తీలో పెద్ద సంఖ్యలో హలీం దుకాణాలు ఏర్పాటుచేశారు. హలీమ్, కబాబ్, ఫలుదా, వివిధ రకాల బిర్యానీలను నగరవాసులు ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







నేడు విగ్రహ ప్రతిష్ట

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేళ్లమ్మ అమ్మవారిని సోమవారం ప్రతిష్ఠించనున్నారు. ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ప్రతిష్ఠమూర్తికి ధాన్యాదివాసం, వస్త్రాదివాసం, పుష్పాభివాసం, శయ్యాదివాసం కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు.